సాక్షి
మెదక్
గురువారం । 3 । అక్టోబర్ । 2024




వీణాపాణి.. వేదవాణి

రెండో బాసరగా ప్రఖ్యాతి గడించిన వర్గల్ విద్యా సరస్వతీ క్షేత్రం శరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబైంది. వివరాలు 10లో ▸



పార్శ్వనాథ విగ్రహం లభ్యం

అపహరణకు గురైన జైనమత పార్శ్వనాథ తీర్థంకర విగ్రహ ఆచూకీ లభించింది. వివరాలు 10లో ▸



కుక్కలు కరిచేస్తున్నాయ్..

కుక్కలు జనాలను హడలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడికి తెగబడుతున్నాయి. వివరాలు 11లో ▸



చిన్నశంకరంపేట: చెన్నాయిపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



శివ్వంపేట: బతుకమ్మను పేరుస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



మెదక్‌లో బతుకమ్మ సంబరాలు

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

పట్టణాలు.. పల్లెలన్నీ పూల వనాలయ్యాయి.. ఇంటింటా బతుకమ్మ సంబురాలు మొదలయ్యాయి. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో... 'చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ..' అంటూ మహిళలు, యువతుల ఆట పాటలతో సందడి నెలకొంది. బుధవారం ఎంగిలి పూల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నా పెద్దా అందంగా, సంప్రదాయంగా ముస్తాబై తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను తెచ్చి ఒక చోట చేర్చారు. వాటి చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ ఆడి పాడి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. శివ్వంపేట మండలం గోమారంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

– మెదక్‌మున్సిపాలిటీ

న్యూస్‌రీల్

ఆ ప్రచారం సరికాదు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్: మంత్రి కొండా సురేఖపై బీఆర్‌ఎస్ నాయకులు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ప్రచారం సరికాదని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మహిళల పట్ల బీఆర్‌ఎస్ నాయకులు హీనంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, నాయకులు మల్లేష్, లలిత, చిన్న ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్‌గుప్తా, మల్లేష్ యాదవ్, అజ్మత్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్‌పై నేటి నుంచి రైతులతో సమావేశాలు

నర్సాపూర్: ట్రిపుల్‌ఆర్ నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించిన భూముల్లో ఏమైనా నిర్మాణాలు ఉంటే వాటి హక్కులకు సంబంధించిన పత్రాలు స్వీకరించేందుకు గురువారం నుంచి గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. నేడు ఉదయం నర్సాపూర్ మండలంలోని మహ్మదాబాద్, తిరుమలాపూర్, మధ్యాహ్నం తుజాల్‌పూర్, పెద్దచింతకుంట గ్రామాల రైతులతో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. 4వ తేదీన ఉదయం మూసాపేట, నాగులపల్లి, మధ్యాహ్నం చిన్నచింతకుంట, రెడ్డిపల్లి, 5న ఉదయం శివ్వంపేట మండలంలోని ఉసిరికపల్లి, గుండ్లపల్లి, కొత్తపేట, మధ్యాహ్నం పోతులబొగూడ, లింగోజిగూడ, 7న శివ్వంపేట మండలంలోని రత్నాపూర్, కొంతాన్‌పల్లి గ్రామాల రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశామని వివరించారు. భూములు కోల్పోయిన రైతులు తమ భూములు, వాటిలో ఉన్న నిర్మాణాలు ఇతరత్రా ఆస్తులకు సంబంధించిన పత్రాలు అందజేయాలని సూచించారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి



క్రీడాకారులతో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

నర్సాపూర్: తెలంగాణ బాలుర సాఫ్ట్‌బాల్ జట్టు జాతీయస్థాయిలో విజయం సాధించాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ శోభన్‌బాబు ఆకాంక్షించారు. నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6వ తేదీ నుంచి ఏపీలోని నంద్యాలలో 42వ జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు ఉన్నాయని చెప్పారు. క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొని ప్రతిభ కనబర్చాలని సూచించారు. ఆయన వెంట జట్టు శిక్షకులు, తదితరులు ఉన్నారు.

నేడు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు

హవేళీఘణాపూర్(మెదక్): జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గురువారం మెదక్ డివిజన్ పరిధిలోని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆయిల్‌పామ్ ఫీల్డ్ విస్తరణ అధికారి భవాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హవేళీఘణాపూర్ రైతు వేదికలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, ఆయిల్‌పామ్ టెక్నికల్ సలహాదారు డాక్టర్ రంగనాయక్, ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ హాజరతారని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో కలిగే లాభాలు, పంట సాగులో వచ్చే సందేహాలను వివరిస్తారని చెప్పారు.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

మంత్రులు రాక

గజ్వేల్: మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నారు. ఉదయం 11గంటలకు స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండాసురేఖ, పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నట్లు డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గజ్వేల్‌లో తొలి అధికారిక కార్యక్రమం కావడంతో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఎఫ్‌డీసీ సర్వేకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 7 వరకు కొనసాగింపు
- జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా రెండు గ్రామాలు..
- రెండు మున్సిపల్ వార్డుల ఎంపిక

మెదక్‌జోన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు (ఎఫ్‌డీసీ) సర్వేకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి నుంచి ఈనెల 7వ తేదీ వరకు సర్వే కొనసాగనుంది. ఇప్పటికే విధి విధానాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా రెండు గ్రామాలు, రెండు మున్సిపల్ వార్డులను ఎంపిక చేశారు.

11 బృందాలు.. నలుగురు అధికారులు

సర్వేలో మొత్తం 11 బృందాలు పాల్గొననున్నాయి. ఒక్కో బృందంలో నలుగురు అధికారులు ఉంటారు. సర్వేలో ప్రధానంగా రేషన్‌కార్డు, ఆరోగ్య, వ్యవసాయ సమాచారంతో పాటు మరిన్ని వివరాలు పొందుపరచనున్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే అన్నింటికీ ఈ కార్డే ప్రమాణికంగా



డిజిటల్ కార్డు నమూనా

మారనుంది. కార్డుపై ఉన్న క్యూఆర్‌సీ కోడ్‌ను స్కాన్ చేస్తే కుటుంబం సభ్యులు వినియోగించుకున్న ప్రభుత్వ పథకాలు, ఇతర పథకాలకు అర్హత, తదితర సమాచారం తెలియనుంది. సర్వే వివరాలను కలెక్టర్ పరిశీలించి 10వ తేదీన ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిసింది.

చిన్న గ్రామాల ఎంపిక

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కోసం పైలెట్ ప్రాజెక్టుగా మెదక్ నియోజకవర్గంలోని చిన్నశంకరంపేట మండలం కామారం, మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు దాయరను ఎంపిక చేయగా, నర్సాపూర్ నియోజకవర్గంలోని గొల్లపల్లి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలో 8వ వార్డు హనుమాన్ వీధిని ఎంపిక చేశారు. ఒక్కో గ్రామంతో పాటు మున్సిపల్ వార్డుల్లో సైతం 150 నుంచి 200 ఇళ్ల ఉన్న గ్రామాలు, వార్డులను ఎంపిక చేశారు. అది కూడా రెవెన్యూ గ్రామం అయి ఉన్న పల్లెలను ఎంచుకున్నారు. ఐదు రోజుల్లో ప్రతి ఇంటి సర్వే పూర్తి కావాలనే ఉద్దేశంతో చిన్న గ్రామాలను ఎంచుకున్నట్లు తెలిసింది.

మహిళే యజమాని

ఫ్యామిలీ డిజిటల్ కార్డులో కుటుంబ పెద్దగా మహిళే ఉండనుంది. ఇప్పటికే మెజార్టీ ప్రభుత్వ పథకాలు మహిళల పేరునే అమలు చేస్తున్నారు. ఈక్రమంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డును సైతం మహిళ పేరుపైనే ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ కార్డు ఆధారంగానే ఇక రేషన్ బియ్యం అందనుందని ఓ అధికారి తెలిపారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పక్కా ప్రణాళిక.. అత్యంత పారదర్శకత

- ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు
- అధికారులతో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సమీక్ష
- సమగ్ర వివరాలు అందించాలని సూచన

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని ప్రతి కుటుంబానికి డిజిటల్ ఫ్యామిలీ కార్డు అందించడానికి పక్కా ప్రణాళికతో గురువారం నుంచి సర్వే నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. సర్వేకు ఐఏఎస్ అధికారిణి హరిచందనను జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించినట్లు చెప్పారు. రెండు నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో 11 బృందాలు ప్రణాళికతో పక్కాగా ఇంటింటి సర్వే పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అన్ని వివరాలు అధికారులకు సమగ్రంగా అందజేయాలని సూచించారు. సర్వేను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మెదక్, నర్సాపూర్ ఆర్డీఓలు రమాదేవి, జగదీశ్వర్‌రెడ్డి, ఈ– డిస్ట్రిక్ మేనేజర్ సందీప్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటం నివాళులర్పిస్తున్న అధికారులు



ఎస్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

గాంధీజీ చూపిన బాటలో నడవాలి

మెదక్‌జోన్/మెదక్‌మున్సిపాలిటీ: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిన మహానుభావుడు జాతిపిత మహాత్మాగాంధీ అని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కొనియాడారు. బుధవారం కలెక్టరేట్‌లో గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ గాంధీజీ చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా అధికారులు నాగరాజుగౌడ్, విజయలక్ష్మి, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే టీఎన్‌జీఓ భవన్‌లో గాంధీ జయంతిని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్రం కోసం సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, స్వదేశీ వంటి ఉద్యమాలు ఎన్నో చేశారని కొనియాడారు.

సింగూరు నీరు విడుదల

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద పెరగడంతో బుధవారం ఒక గేటును రెండు మీటర్ల మేర పైకి ఎత్తి దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 29.9 టీఎంసీల నీరును నిల్వ ఉంచి.. మిగతా నీటిని దిగువకు వదులుతున్నారు. కాగా, ప్రాజెక్టు ఆరో నంబర్ గేటును ఎత్తి దిగువకు 10,731 క్యూసెక్కుల నీటిని, జలవిద్యుత్ కేంద్రం ద్వారా 2,800 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని అధికారులు తెలిపారు.

ధృవపత్రాల పరిశీలన

మెదక్ కలెక్టరేట్: డీఎస్సీ అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన కొనసాగుతోందని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. బుధవారం 275 మంది సర్టిఫికెట్లను పరిశీలించినట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 310 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛ భారత్‌కు కృషి చేయాలి

ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛ భారత్ నిర్మాణానికి కృషి చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని గంజి మైదానంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కనబడుతోందని, పట్టణ వాసులందరూ ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా విరమించుకోవాలని కోరారు. చెత్తా, చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడకుండా స్వచ్ఛతను పాటించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, గాంధీ జయంతిని పురస్కరించుకొని ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేశారు.

హైడ్రాపై అఖిలపక్షం

హైడ్రాకు సంబంధించి ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వస్తున్నాయని, దీనిపై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ రఘునందన్, తదితరులు

డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సంగారెడ్డిలో మాట్లాడుతూ.. అసలు హైడ్రా విధివిధానాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. నీటి వనరుల విషయమై భాగ్యనగరం గతంలో, భవిష్యత్‌లో ఎలా ఉంటుందో వివరించాలని కోరారు. మల్లన్నసాగర్, మూసీ అంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పరస్పరం విమర్శలు చేసుకుంటూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. ఒక ఆడబిడ్డను అవమాన పరుస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

భూసేకరణలో గిమ్మిక్కులు..!

దళితుల అసైన్డ్ భూములే ఎక్కువగా సేకరణ

- ఓ రెవెన్యూ ఉన్నతాధికారి బినామీ పేర్లతో ఉన్న భూములను వదిలేసిన వైనం
- తాజా మాజీ ప్రజాప్రతినిధుల భూములూ వదిలేశారు
- బడా బాబుల భూముల జోలికి వెళ్లని అధికారులు
- ఫార్మా విలేజ్ భూసేకరణ ప్రక్రియలో అనుమానాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఫార్మా విలేజ్ కోసం చేపట్టిన భూసేకరణలో గిమ్మిక్కులు చోటు చేసుకున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. న్యాల్‌కల్ మండలం డప్పూరు గ్రామంలో దళితులు, ఇతర బడుగు వర్గాలకు చెందిన అసైన్డ్ భూములను ఈ ఫార్మా విలేజ్ కోసం సేకరిస్తున్న అధికారులు.. దాని పక్కనే ఉన్న ఓ రెవెన్యూ ఉన్నతాధికారి తన బినామీ పేర్లతో ఉన్న సుమారు 30 ఎకరాల భూమి జోలికి వెళ్లలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అలాగే స్థానిక ఓ తాజా మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించిన భూములను కూడా సేకరించే జాబితాలో చేర్చలేదనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు జిల్లాలోని ప్రజాప్రతినిధి అనుచరుడి భూమిని కూడా వదిలేసి.. దళితుల అసైన్డ్ భూములను సేకరించే జాబితాలో చేర్చారనే ప్రచారం జరుగుతోంది.



డప్పూర్ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించిన బాధితులు. (ఫైల్)

అసైన్డ్ భూములే అధికం

లైఫ్ సైన్సెస్ హబ్ పేరుతో ప్రభుత్వం న్యాల్‌కల్ మండలం డప్పూరు, వడ్డీ, మాల్గీ గ్రామాల్లో మొత్తం 2,003 ఎకరాల భూమిని సేకరించేందుకు రెవెన్యూ అధికారులు ఇటీవల ప్రాథమిక ప్రకటన (ప్రిలిమినరీ నోటిఫికేషన్) జారీ చేశారు. ఇందులో ఒక్క డప్పూరులోనే 1,383 ఎకరాలు సేకరిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇందులో ఏకంగా 516 ఎకరాలు దళితులు, ఇతర బడుగు బలహీనవర్గాలకు చెందిన అసైన్డ్ భూములను సేకరిస్తున్నారు. కానీ కొందరు బడా బాబుల భూముల జోలికి వెళ్లలేదు. ఈ అసైన్డ్ భూములతో పాటు ఇదే గ్రామంలో మరో 867 ఎకరాలు పట్టా భూములను కూడా సేకరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ భూములు కూడా చిన్న, సన్నకారు రైతులవే కావడం గమనార్హం.

ఉద్యమిస్తున్న గ్రామస్తులు

పచ్చని పంటలు పండే తమ గ్రామంలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయవద్దని కోరుతూ నిర్వాసిత గ్రామాల వాసులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. పంటలు పండించుకుని తరతరాలుగా జీవనం సాగిస్తున్న తమ భూములను లాక్కోవద్దని నిరసనలు చేపట్టారు. పర్యావరణాన్ని సర్వనాశనం చేసే ఈ ఫార్మా కంపెనీలను రెండు పంటలు పండే తమ పచ్చని పంట పొలాల్లో కాకుండా, ఈ బంజరు భూముల్లో ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కానీ అధికారులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో భూసేకరణలో బడా బాబుల భూములను వదిలేసి ఎన్నో ఏళ్లుగా తమ జీవనాధారమైన భూములను లాక్కోవద్దని పేర్కొంటున్నారు.

అలాంటిదేమీ లేదు



ఫార్మా విలేజ్‌కు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. భూముల సేకరణలో బడాబాబుల భూములను వదిలేశారనే ఆరోపణల్లో నిజం లేదు. కొందరి తీసుకోవడం ,కొందరివి వదిలేయడం అనేది ఉండదు. ప్రస్తుతానికి ప్రాథమిక నోటిఫికేషన్ మాత్రమే విడుదల చేశాం. అవసరమైతే వారి భూములు కూడా సేకరిస్తాం. టీఎస్ ఐఐసీ ఇచ్చిన రిక్వైర్‌మెంట్ ప్రకారం భూములను సేకరిస్తున్నాం.

– ఎస్.రాజు, జహీరాబాద్ ఆర్డీఓ, భూసేకరణ అధికారి

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ముస్తాబైన ఏడుపాయల

పాపన్నపేట(మెదక్): దసరా శరన్నవరాత్రోత్సవాలకు ఏడుపాయల వనదుర్గమ్మ ముస్తాబైంది. గోకుల్ షెడ్డులో నిర్వహించనున్న వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు గురువారం ఉత్సవాలను ప్రారంభించనున్నారు. నేటి నుంచి 12వ తేదీ వరకు వివిధ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈనెల 8వ తేదీన వనదుర్గమ్మకు మహిళలు బోనాలు తీస్తారు. 11న సుహాసిని పూజ, చండీయాగం నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. నవరాత్రి పూజల్లో పాల్గొనే దంపతులు రూ. 251, ప్రతీ రోజు గోత్రనామార్చాన కోసం రూ. 1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

తీరొక్క అలంకరణలో..

ఏడుపాయల దుర్గమ్మ తీరొక్క అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారు. గురువారం మొదటి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవి (ముదురు ఎరుపు రంగు వస్త్రాలతో)గా భక్తులకు దర్శనమిస్తారు. శుక్రవారం గాయత్రీదేవి (గులాబీ), శనివారం అన్నపూర్ణ(నీలం), ఆదివారం వనదుర్గా (ఆకుపచ్చ), సోమవారం మహాలక్ష్మి (పెసర), మంగళవారం దుర్గాదేవి (ముదురు నీలం) బుధవారం సరస్వతీ దేవి (తెలుపు), గురువారం మహిషాసుర మర్దిని (ఎరుపు), శుక్రవారం సర్వ నారాయణి సిద్ధి (మెరూన్), శనివారం రాజరాజేశ్వరీ దేవి (పసుపు రంగు వస్త్రాలతో)గా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.





గోకుల్‌షెడ్డులో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

గాంధీ జయంతి రోజు మాంసం విక్రయం

ఇద్దరిపై కేసు నమోదు



మాంసం స్వాధీనం చేసుకున్న అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పలు గ్రామాల్లో అక్రమంగా జరుగుతున్న మాంసం విక్రయాలపై మండల పంచాయతీ అధికారి లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ముప్పిరెడ్డిపల్లి, కూచారం గ్రామాల్లో దాడులు నిర్వహించగా చికెన్, మటన్ మాంసం అమ్ముతూ పట్టుబడ్డారు. మాంసంను ఫినాయిల్ పోసి పూడ్చివేయించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రూ.4 వేలు జరిమాన విధించినట్లు అధికారులు తెలిపారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు విద్యార్థి ఎంపిక



కృష్ణను అభినందిస్తున్న పీడీ నర్సింలు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ తెలంగాణ ఆదర్శ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థి దిగాల క్రిష్ణ సీనియర్ రిథమిక్ కేటగిరి విభాగంలో బంగారు పతకం, ఆర్టిస్టిక్ విభాగంలో వెండి పతకం సాధించి జాతీయ యోగా పోటీలకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుంకరి సాయిలు బుధవారం తెలిపారు. భారత యోగాసన, తెలంగాణ యోగాసన అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి యోగాసనా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ 2024 పోటీలు గత నెల 30న నిజామాబాద్ పట్టణంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. త్వరలో జరిగే జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. విద్యార్థిని ప్రోత్సహించి జాతీయ స్థాయికి ఎంపికయ్యేలా కృషి చేసిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నర్సింలును ప్రిన్సిపాల్ అభినందించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : స్వామి

గజ్వేల్‌రూరల్: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కేఆర్‌పీఎస్ (కుర్మ రిజర్వేషన్ పోరాట సమితి) రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన బాలికపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తున్నామని, మానవత్వం మంటగలిపే విధంగా వ్యవహరించిన కామాంధుడిని బహిరంగంగా ఉరితీయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై గవర్నర్ బండారు దత్తాత్రేయ స్పందించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో చలనం రాలేదని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు కేఆర్‌పీఎస్ పోరాడుతుందని తెలిపారు.

ఖైదీల హక్కులను కాపాడాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్



బహుమతి అందజేస్తున్న రమేశ్

సంగారెడ్డి టౌన్ : ఖైదీలకు హక్కులు ఉంటాయని వాటిని కాపాడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. బుధవారం కందిలోని జైలులో ఖైదీల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ. ఖైదీలకు ఉచిత సహాయం అందించడానికి న్యాయ సేవాధికారి సంస్థ ఉందని, దీనిని ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జైలు డీఐజీ, సూపరింటెండెంట్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జైల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీణాపాణి.. వేదవాణి

శంభునికొండపై చదువుల తల్లి

- నేటి నుంచి దసరాశరన్నవరాత్రోత్సవాలు
- సర్వాంగ సుందరంగా వర్గల్ క్షేత్రం
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



శంభుని కొండపై వర్గల్ క్షేత్రం (ఏరియల్ వ్యూ)

ఆలయంలో శ్రీసరస్వతీ అమ్మవారు

విద్యుత్ కాంతుల్లో వర్గల్ క్షేత్రం

వర్గల్(గజ్వేల్): వేదపారాయణాల నిలయం.. అన్నార్థుల ఆకలితీర్చే అన్నదానక్షేత్రం.. చిన్నారులకు జ్ఞానం ప్రసాదించే అక్షరాభ్యాస కేంద్రం.. భక్తుల కొంగుబంగారం.. తెలంగాణలో రెండో బాసరగా ప్రఖ్యాతి గడించిన సిద్దిపేట జిల్లా వర్గల్ శ్రీవిద్యా సరస్వతీ క్షేత్రం ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి గురువారం 3 నుంచి 12వ తేదీ వరకు అత్యంత వైభవంగా శరన్నవరాత్రోత్సవాల నిర్వహణకు ముస్తాబైంది. ఈ సందర్భంగా క్షేత్ర విశేషాలతో ప్రత్యేక కథనం..

- స్వయంభువుగా మహదేవుడు వెలిసిన వర్గల్ శంభునికొండపై సప్తస్వరాల గుండు చెంత శ్రీవిద్యా సరస్వతీ ఆలయం కొలువుదీరింది. 1989లో శిలాన్యాసం, 1992లో విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. నాటి నుంచి అమ్మవారు తన చెంత చేరిన భక్తులను కటాక్షిస్తూ దినదిన ప్రవర్ధమానమై విరాజిల్లుతుంది.
- 700 ఏళ్ల నాటి స్వయంభూ శంభులింగేశ్వరాలయం, సుబ్రహ్మణ్యేశ్వరాలయం, శనీశ్వరాలయం, శారదా చంద్రమౌళీశ్వరాలయం, శ్రీలక్ష్మీ గణపతి, కల్యాణ వెంకటేశ్వరాలయాలు ఇక్కడ కొలువుదీరాయి. కొండపైన మెట్ల మార్గంలో 14 అడుగుల ఎత్తైన వీణాపాణి విగ్రహం ఉన్నది.
- అక్షరాభ్యాస మహామండపం, కంచి శంకరమఠం, వేద పాఠశాల, నిత్యాన్నదాన సత్రం ఉన్నాయి. బస చేసేందుకు సత్రాలు, తాగునీరు, టాయిలెట్లు ఉన్నాయి. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యపీడితులు కొండపైన అమ్మవారిని దర్శించుకునేందుకు లిఫ్ట్ సౌకర్యం ఉంది.

నేటి నుంచి నవరాత్రోత్సవాలు

గురువారం నుంచి ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. కలశస్థాపన, చతుషష్ఠ్యోపచార పూజలు నిర్వహిస్తారు. 9న బుధవారం విశేష మూలనక్షత్రం సందర్భంగా ఉదయం గిరి ప్రదక్షిణ, 9 గంటలకు లక్ష పుష్పార్చన, 11 గంటలకు పుస్తక పూజ, 11న శుక్రవారం మహర్నవమి, అమ్మవారికి అష్టోత్తరశత కలశాభిషేకం, 12న శనివారం కలశోద్వాసన, అభిషేకం, విద్యాసరస్వతీ మాత విజయదర్శనం, శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీవెంకటేశ్వర స్వామికి విశేష అభిషేకం జరుగుతుంది.

క్షేత్రానికి ఆర్టీసీ సౌకర్యం

హైదరాబాద్ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న వర్గల్ క్షేత్రానికి సికింద్రాబాద్ గురుద్వార్ నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రతీ రెండు గంటలకు ఒకటి చొప్పున బస్సు బయలుదేరుతుంది. సికింద్రాబాద్ నుంచి గజ్వేల్, సిద్దిపేట, కరీంనగర్ రూట్‌లో వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో వర్గల్ క్రాస్ రోడ్డు వద్ద దిగి ఆటోలో క్షేత్రానికి చేరుకోవచ్చు.

ఏర్పాట్లు పూర్తి



శ్రీ విద్యాసరస్వతీ అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఉత్సవాలకు పీఠాధిపతులు విద్యాశంకరభారతీస్వామి, మాధవానంద సరస్వతీ స్వామి, మధుసూదనానంద సరస్వతీ స్వామి తదితర ప్రముఖులు హాజరవుతున్నారు. విద్యుద్దీపాలతో ఆలయాన్ని తీర్చిదిద్దాం. భక్తులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. వాహనాలకు పార్కింగ్ సదుపాయం ఉంది. మహాప్రసాద అన్నదానం ఉంటుంది. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని తరించాలి.

– యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి, ఆలయ వ్యవస్థాపక చైర్మన్

జల్సాలకు అలవాటుపడి బైక్‌ల చోరీ

- పోలీసుల అదుపులో ముగ్గురు
- 9 వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జల్సాల అలవాటుపడి బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న దంపతులతో పాటు మరొకరిని బుధవారం కొల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని లాలాగూడకు చెందిన హరీశ్ ఓ సంస్థలో మార్కెటింగ్ చేస్తున్నాడు. గత నెల 26న పనిపై తెల్లాపూర్‌కు వచ్చాడు. రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ ఎదుట బైక్ పార్కు చేసి భోజనం చేయడానికి లోపలికి వెళ్లాడు. భోజనం చేసి వచ్చేసరికి బైక్ మాయమైంది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒకటో తేదీన రాత్రి కొల్లూరు పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అయితే, చోరీకి గురైన బైక్‌పై శంకర్‌పల్లి మండలం ఇంద్రారెడ్డికాలనీలో నివాసం ఉండే భానుప్రసాద్ అతడి భార్య కీర్తన వెళ్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. వారిని విచారించగా మరిన్ని దొంగతనాలు బయటపడ్డాయి. భార్యాభర్తలు ఇద్దరూ వారి మిత్రుడు సేలం సాయి కొల్లూరు, బోయగూడ, భువనగిరి, కాజీపేట, జనగావ్, కుషాయిగూడలో ఇప్పటి వరకు 14 బైక్‌లను చోరీ చేసినట్లు విచారణలో తేలింది. బైక్‌లను సిద్దిపేట జిల్లా జగదేవపూర్‌కు చెందిన కరుణాకర్‌కు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భార్యాభర్తలతో పాటు కరుణాకర్‌ను అరెస్ట్ చేసి, 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. సేలం సాయి పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

మెదక్ మున్సిపాలిటీ: ఏటీఎం వద్ద ఓ వ్యక్తిని మోసం చేసి డబ్బులు ఎత్తుకెళ్లిన దొంగను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు రూ.5 వేలు డిపాజిట్ చేసేందుకు ఓ వ్యక్తి వచ్చాడు. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన బేగరి అరవింద్ నాకు డబ్బులు ఇవ్వండి మీకు ఫోన్ ద్వారా పంపిస్తా అని నమ్మించి వెళ్లిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం నిందితుడిని పట్టుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

ఆలయంలో హుండీ చోరీ

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం వెంకటేశ్వర దేవాలయంలో మంగళవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తుల కథనం మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి చొరబడి హుండీ పగులగొట్టి సుమారు రూ.30 వేలు ఎత్తుకెళ్లాడు. ఆలయ పూజారి ప్రవీణ్‌శర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

ఆవు అపహరణ



ఆవును తీసుకెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి

వట్‌పల్లి(అందోల్): అందోలు మండలం సంగుపేట గ్రామంలో గుర్తు తెలియని దొంగలు ఆవును ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కే.సురేశ్ ఆవు, దూడలను గ్రామంలోని మహేందర్‌గౌడ్ కిరాణ షాపు పక్కన కట్టేశాడు. బుధవారం తెల్లవారుజామున ఇన్నోవా కారులో నలుగురు వచ్చి ముందుగా దూడకు ఇంజక్షన్ ఇవ్వడంతో పడిపోయింది. అనంతరం తాడు కట్ చేసి ఆవును తీసుకెళ్లారు. ఈ విషయమంతా సీసీటీవీ ఫుటేజీల్లో రికార్డు అయ్యింది. బుధవారం ఉదయం వెళ్లేసరికి ఆవు కనిపించకపోవడంతో పోలీసులకు ఇచ్చాడు. ఎస్‌ఐ పాండు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న వాహనాలు

బెజ్జంకి(సిద్దిపేట) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ క్రిష్టారెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లాలోని వివిధ మండలాల నుంచి 8 టాటా ఏసీల్లో తెచ్చిన సుమారు 150 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం డీసీఎంలోకి మారుస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి సిద్దిపేట ఏసీపీ మధు ఆధ్వర్యంలో దాడి చేసి మండలంలోని తోటపల్లి శివారులోని పౌల్ట్రీ ఫామ్ వద్ద బియ్యాన్ని పట్టుకున్నాం. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యాన్ని బెజ్జంకి పోలీస్ స్టేషన్‌కు తరలించాం. తరలిస్తున్న యాదాద్రి జిల్లా బొమ్మల రామవరానికి చెందిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సురేఖ క్షమాపణ చెప్పాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సరికాదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో ఆమె మాట్లాడారు. సినీ పరిశ్రమలో ఉన్న మహిళపై ఎవరో ట్రోల్ చేస్తే అది కేటీఆర్‌కు ఆపాదించడం దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. కేటీఆర్‌కు మంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి తమపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు మేము మహిళలం అన్న విషయం గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చంద్రాగౌడ్, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

- పోలీసుల అదుపులో ఏడుగురు, మరో ఇద్దరు పరారీలో
- 1040 కిలోల గంజాయి, కారు స్వాధీనం

సిద్దిపేటకమాన్: గంజాయి కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయిస్తున్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన బందుగుల శశివర్ధన్, కోడూరి సురేశ్, గడ్డం రఘువంశీ, దుబ్బాక దయాకర్, బాలిశెట్టి లక్ష్మణ్, ఎండీ చాంద్ పాషా, ఒగ్గు రోహిత్, ఎండీ షాదుల్, కాసనగొట్టు నివాస్ కొంత కాలంగా జల్సాలకు అలవాటు పడ్డారు. విశాఖపట్టణం, హైదరాబాద్ ధూల్‌పేట నుంచి గంజాయి కొనుగోలు చేసి వారు సేవించడం, ఇతరులకు ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. వీరంతా పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీలో గంజాయి సేవిస్తూ, ఇతరులకు విక్రయిస్తున్నారని పోలీసులకు నమ్మదగిన సమాచారం వచ్చింది. దీంతో సీఐ ఉపేందర్, ఎస్‌ఐ రాజేశం, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి దాడులు చేశారు. పోలీసులను చూసి గోడ దూకి పారిపోయే ప్రయత్నం చేయగా శశివర్ధన్ కాలుకు గాయమైంది. నిందితుల్లో షాదుల్లా, నివాస్ పారిపోగా మిగితా ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి 1,040 గ్రాముల ఎండు గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మంత్రాల నెపంతో దాడి

14 మందిపై కేసు నమోదు

రామాయంపేట(మెదక్): మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో బుధవారం రాత్రి కొందరు గ్రామస్తులు భార్యాభర్తలపై దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గుర్రం విజయ, ఆమె భర్త సిద్దిరాములు మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో కొందరు వారి ఇంటి పై దాడి చేశారు. అనంతరం రాత్రి వేళ గ్రామంలో చెట్టుకు కట్టేసి కొట్టారు. బాధితులు 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై బాలరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించి బాధితులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్యాభర్తల పై దాడికి పాల్పడ్డ 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



పొలంలో నర్సింలు మృతదేహం

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అవుసులపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని అవుసులపల్లి గ్రామానికి చెందిన బోయిని నర్సింలు(55) బుధవారం సాయంత్రం పొలం వద్ద బోరుమోటార్ వద్ద రిపేర్ చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేశాడు. తిరిగి మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్ ఆన్‌చేసే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య విజ్జమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు.

ఈతకు వెళ్లి యువకుడు..

పటాన్‌చెరు టౌన్ : ఈతకు వెళ్లి నీట మునిగి యువకుడు మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బొల్లారం వైఎస్ఆర్ కాలనీకి చెందిన షంషీత కాతూన్ కుమారుడు అల్లావుద్దీన్(18) కారు మెకానిక్ నేర్చుకుంటున్నాడు. బుధవారం ఉదయం స్నేహితులతో కలిసి అమీన్‌పూర్ పరిధిలోని సుల్తాన్‌పూర్ సమీపంలోని క్వారీ గుంతలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ..



మోహన్ (ఫైల్)

టేక్మాల్(మెదక్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. టేక్మాల్ గ్రామానికి చెందిన బాజ మోహన్ (29) వ్యవసాయంతోపాటు, కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 1వ తేదీన మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఎల్లాస్పూర్ గ్రామంలో రోడ్డు పక్కన ముళ్ల పొదల్లోని మోహన్ నీటి గుంతలో మృతదేహమై కనిపించాడు. గ్రామానికి చెందిన సాయికుమార్ ఇది గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు విషయం తెలుపగా, మోహన్ ముఖంపై గాయాలు ఉండటంతో టేక్మాల్ గ్రామానికి చెందిన తంప్లూరి శివరాజ్‌పై అనుమానం ఉన్నట్లు తెలిపారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ దయానంద్ తెలిపారు. మెదక్ నుంచి క్లూస్ టీం, సంగారెడ్డి నుంచి జాగిలాన్ని తెప్పించి అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.

నీటి సంపులో పడి బాలుడు...



రుద్రాన్ మృతదేహం

చిన్నకోడూరు(సిద్దిపేట): నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కమ్మర్లపల్లిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బైకని వేణు, రేణుక దంపతులకు ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రుద్రాన్(3) బుధవారం సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయాడు. బాలుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వెతుకుతుండగా సంపులో కనిపించాడు. బయటకు తీసి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు బస్టాండ్‌లో మంగళవారం భిక్షాటన చేసుకుంటూ గుర్తు తెలియని వ్యక్తి(60) స్పృహ తప్పి పడిపోయాడు. చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అనారోగ్యంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి కథనం మేరకు.. మెదక్ జిల్లా టేక్మాల్ మండలానికి చెందిన లక్ష్మయ్య కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం వచ్చి రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈయన కూతురు రాధిక(20) పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతోంది. కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న రాధిక బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు బయటకు వెళ్లగా ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి తరలించారు. తన కూతురు అనారోగ్య సమస్యతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని యువతి..

యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఏపీలోని శ్రీకాకుళంకు చెందిన శ్రావణి(23) బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ముత్తంగి సాయిప్రియా కాలనీలో ఉంటున్నారు. చిట్కుల్‌లోని అరబిందో పరిశ్రమలో పని చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. బుధవారం సాయంత్రం శ్రావణి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహం పోస్టుమార్టం కోసం తరలించారు. యువతి మృతికి గల కారణాలు తెలియరాలేదని, కుటుంబ సభ్యులు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

నిజాంపేట(మెదక్): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం మేరకు.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన దండు నరేశ్(42) కొంత కాలం కిందట బతుకుదెరువు కోసం దుబాయికి వెళ్లి ఆరోగ్యం బాగాలేక తిరిగొచ్చాడు. పని లేకపోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులపాలయ్యాడు. దీంతో మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహ్యత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దొరికిన పార్శ్వనాథ విగ్రహం



టేక్మాల్(మెదక్): వెయ్యేళ్ల చరిత్ర ఆనవాళ్లు కలిగిన జైనమత పార్శ్వనాథ తీర్థంకర విగ్రహం బుధవారం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తుంబురేశ్వరాలయ ప్రాంగణంలోని చెరువు మధ్యలో గల దేవతల కుచ్చెలో చారిత్రక వారసత్వ సంపద కలిగిన జైనమత పార్శ్వనాథ విగ్రహం కొలువై ఉంది. గతేడాది జూన్ 7వ తేదీన విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు అపహరించేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. మళ్లీ ఆగస్టు 30న పార్శ్వనాథుడి విగ్రహం అపహరణకు గురైందని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. అనుమానం వ్యక్తిని విచారించగా పెద్ద మొత్తంలో డబ్బులకు అమ్ముకున్నట్లు తెలిసింది. వారం రోజులుగా విచారణలో నిమగ్నమైన హైదరాబాద్‌లో ఎస్‌ఐ రాజేష్, ఇతర సిబ్బంది నల్గొండ ప్రాంతంలో దుండగులను పట్టుకొని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. చేసుకున్న విగ్రహాన్ని టేక్మాల్ పోలీష్‌స్టేషన్‌లో భద్రపరిచారు. కేసు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మంత్రి కాన్వాయ్ వాహనం, బైక్ ఢీ

- బాలుడు సహా ముగ్గురికి తీవ్ర గాయాలు
- కిమ్స్ ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు
- సిద్దిపేట జిల్లా గౌరారం శివారులో ఘటన



గాయపడిన బాలరాజు

వర్గల్(గజ్వేల్): మంత్రి శ్రీధర్ బాబు కాన్వాయ్‌లోని వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో బాలుడు సహా ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం సిద్దిపేట జిల్లాలోని రాజీవ్ రహదారిపై జరిగింది. క్షతగాత్రులను అదే కాన్వాయ్ వాహనంలో గజ్వేల్ ఆస్పత్రికి తరలించి స్థానిక పోలీసులకు సమాచారమందించారు. ఈ ఘటనకు సంబంధించి గౌరారం ఎస్‌ఐ కరుణాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం మర్కూక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన మన్నెబోయిన బాలరాజు(38), అతని కుమారుడు మన్నెబోయిన భానుప్రసాద్(10) తోపాటు అదే గ్రామానికి చెందిన చంద కనకయ్య(42) బైక్ మీద గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీ నుంచి తమ గ్రామానికి వస్తున్నారు. గౌరారం శివారు ముట్రాజ్‌పల్లి క్రాస్‌రోడ్డు మలుపు వద్ద రాజీవ్ రహదారి రోడ్డు దాటుతుండగా సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మంత్రి శ్రీధర్ బాబు కాన్వాయ్‌లోని వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ మీద ఉన్న ముగ్గురు గాయాలపాలయ్యారు. కాన్వాయ్ వాహనంలోనే క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలిసి గౌరారం పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రులను హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బాధితుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.